## సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 1: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత ఉపాధి శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. ఆదివారం 24 ఏరియాలోని సేవా సమితి శిక్షణ కేంద్రంలో సేవా అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్‌తో కలిసి శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ నిరుద్యోగ యువతీయువకులు సేవా సమితి కల్పిస్తున్న ఉచిత ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తద్వారా కుటుంబానికి ఆర్థింగా చేదోడువాదోడుగా నిలవా లని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, శిక్షణలో మెలకువలను శ్రద్ధగా నేర్చుకోవాలని కోరారు. 125 మంది మహిళలకు వివిధ రకాల శిక్షణల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మూడు నెలలపాటు నిర్వహించే శిక్షణకు అందరూ హాజరుకావాలన్నారు. టైలరింగ్ , మగ్గం, బ్యూటీషియన్ కోర్సులను నేర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సేవా కార్యదర్శి విజయ, సులక్షణ, శిక్షకులు, తదితరులున్నారు.

## ఆర్జీ-1లో 97 శాతం ఉత్పత్తి

గోదావరిఖని, అక్టోబర్ 1: ఆర్జీ-1 ఏరియాలో గడిచిన సెప్టెంబర్ మాసానికి 97 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. గత మాసంలో 3,17,300 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గానూ 3,07,177 టన్నులతో 97 శాతం ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. 2023-24 వార్షిక సంవత్సరానికి 43,80,000 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా సంస్థ నిర్దేశించిట్లు తెలిపారు. వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగిందని, రానున్న రోజుల్లో వంద శాతం ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తామని చెప్పారు. ఇప్పటివరకు 1619 మంది ఉద్యోగులకు మెడికల్ ఇన్వాలిడేషన్ కాగా, 1397 మందిని కారుణ్య నియామకా ద్వారా తీసుకున్నట్లు తెలిపారు. 126 మంది రూ.25 లక్షల చొప్పున తీసుకున్నారని, 13 మందికి ఎంఎంసీ ద్వారా నెలకు రూ.26 వేల చొప్పున ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ఆర్జీ-1లో 1536 మందికి లబ్ధి చేకూరిందన్నారు. సీపీఆర్ఎంఎస్ ద్వారా 5353 మంది ఉద్యోగ విరమణ పొందిన వారికి మెడికల్ కార్డులను ఇచ్చినట్లు తెలిపారు. 5021 మంది తమ కార్డులు రెన్యువల్ చేసుకున్నారనీ, 332 మందికి ఇంకా రెన్యువల్ చేయాల్సి ఉందన్నారు. ఆర్జీ-1లో కొత్తగా నిర్మిస్తున్న 17 ఎంఎల్ డీ మురుగు నీటి శుద్ధి ప్లాంట్ పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. జనవరి 31లోగా అందుబాటులోకి వస్తుందన్నారు.

### ఇల్లెందు ఏరియాలో 149 శాతం

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 1: బొగ్గు ఉత్పత్తి వివరాలను ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ వెల్లడించారు. ఆదివారం జీఎం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్,2023 నెలకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి 2.12 లక్షల టన్నులకు గానూ 3.10 లక్షల టన్నుల బొగ్గు తీసినట్లు చెప్పారు. 146 శాతం ఉత్పత్తి చేశామన్నారు. 1.97 లక్షల టన్నుల బొగ్గును రైల్వే మార్గం ద్వారా, 0.37 లక్షల టన్నుల బొగ్గును రోడ్డు మార్గం ద్వారా, 0.87 లక్షల టన్నులలను ఆర్‌సీహెచ్‌పీ ద్వారా మొత్తం 3.21 లక్షల టన్నుల బొగ్గును బట్వాడా చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ నెలలో 52 రేకుల బొగ్గును ఉత్పత్తి చేశామని తెలిపారు. అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులను అభినందించారు. ఎస్‌వోటూ జీఎం మల్లారపు మల్లయ్య, సేఫ్టీ ఆఫీసర్ పీ శ్రీనివాస్, ఏజీ ఎం ఐఈడీ గిరిధర్‌రావు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్ రా వు తదితరులు పాల్గొన్నారు.

## యాజమాన్యం సహకరించాలి

శ్రీరాంపూర్, అక్టోబర్ 1: సింగరేణిలో ఎన్నికల నిర్వహణకు యాజమాన్యం డీవైసీఎల్సీకి సహకరించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. కాలపరిమితి ముగిసినా ఎన్నికలకు అభ్యతరం తెలపడం సరికాదన్నారు. వెంటనే యాజామాన్యం ఎన్నికల ఏర్పాట్లు చేయాలని, కార్మికుల వివరాలు (ఓటర్లు) అందించాలని కోరారు. యాజమాన్యం ఎన్నికల రద్దుకు డివిజన్ బెంచ్‌కు వెళ్లకుండా తమ యూనియన్ ఆధ్వర్యంలో కోర్టులో కేవియట్ కేసు వేశామన్నారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మ య్య, పిట్ కార్యదర్శులు ఆకుల లక్ష్మణ్, నగేశ్, మల్లేశం, లచ్చన్న, నర్సింహారావు, కాంట్రాక్టు కార్మిక సంఘం రీజియన్ కా ర్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు దామోదర్, మహేశ్, రవి, రాకేశ్, శ్రీకాంత్, మల్లేశం, మురళీచౌదరి, నవీన్‌రెడ్డి, యాదగిరి తదిరతులు పాల్గొన్నారు.

# క్రమబద్ధీకరణతో ఆనందహేల



- 2266 మంది బదిలీ వర్కర్లు జనరల్ మజ్దూర్లుగా మార్పుపై హర్షాతిరేకాలు
- విద్యార్హతను బట్టి ఉన్నత స్థాయికి వెళ్లే అవకాశం
- యువ కార్మికుల్లో సంతోషం

శ్రీరాంపూర్, అక్టోబర్ 1: సింగరేణిలో బదిలీ వర్కర్లుగా పనిచేస్తున్న 2226 మందికి దసరా పండుగకు ముందే యాజమాన్యం తీపికబురు అందించింది. కారుణ్య నియామకాల ద్వారా చేరిన వారు, సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న నేపథ్యంలో పర్మినెంట్ కార్మిక హోదా రావడంతో సంతోషాలు, హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తునారు. యాజమాన్యం తమకు జనరల్ మజ్దూర్లుగా అవకాశం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిలో భూగర్భ గనుల్లో కనీసం 190 మస్టర్లు, ఓసీపీల్లో కనీసం 240 మస్టర్లు పనిచేసిన బదిలీ వర్కర్లను జరనల్ మజ్దూర్లుగా గుర్తిస్తూ యాజమాన్యం ఉద్యోగోన్నతి కల్పించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచే వీరందరినీ జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తున్నట్లు ప్రకటించింది. గతంలో బదిలీ వర్కర్లుగా ఉద్యోగంలో చేరిన కార్మికులు జరనల్ మజ్దూర్లుగా గుర్తింపు రావడానికి కనీస మస్టర్లు ఉన్నప్పటికీ ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. కాగా రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు 2017 నుంచి ఎప్పటికప్పుడు జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తూ వస్తున్నారు. తొలిసారిగా 2017 అక్టోబర్‌లో ఒకే దఫా 2718 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా గుర్తించింది. అనంతరం ప్రతి ఏడాది కనీస మస్టర్లు పూర్తి చేసిన వారందరినీ జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తూ క్రమబద్ధీకరించింది. కాగా 31 డిసెంబర్ 2022కు ముందు సంస్థలో బదిలీ వర్కర్లుగా చేరిన వారిలో కనీసం 190/240 మస్టర్ల అర్హత కలిగిన వారందరినీ ఇప్పుడు జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించింది. దీంతో 2017 నుంచి ఇప్పటి వరకు జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజ్ అయిన వారి సంఖ్య 13,981 కు చేరింది. సింగరేణి కారుణ్య డిపెండెంట్ ప్రక్రియలో ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరినీ తొలుత బదిలీ వర్కర్లుగా సంస్థ నియమిస్తుంది. ఏడాది కాలం పనిచేసిన అనంతరం కనీస హాజర్లు ఉన్న వారిని మాత్రమే జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తుంది. నాటి నుంచి మాత్రమే వారు పూర్తి స్థాయి పంపెనీ ఉద్యోగులుగా గుర్తించబడుతారు. దీని ద్వారా పదోన్నతులు పొందడానికి వీలు కలుగుతుంది. కారుణ్య నియామక ప్రక్రియలో సింగరేణిలో చేరిన దాదాపు 16 వేల మంది వారసుల్లో ఎక్కువ మంది మంచి విద్యార్హత కలిగి ఉన్నారు. ఇటువంటి వారు జనరల్ మజ్దూర్లుగా గుర్తింపు పొందడం వల్ల కంపెనీ తరచూ నిర్వహించే ఇంట్నల్ పరీక్షల్లో తమ విద్యార్హతలకు తగిన ఉద్యోగాలను పొందే సదావకాశం ఏర్పడుతుంది.

### ఉద్యోగోన్నతికి అవకాశం



నా తండ్రి మెడికల్ అన్‌ఫిట్ కావడంతో 2022లో బదిలీ వర్కర్‌గా ఉద్యోగంలో చేరా. నేను బీటెక్ మైనింగ్ చేసిన. ఇప్పుడు జనరల్ మజ్దూర్‌గా క్రమబద్ధీకరణ చేయడం ఆనందంగా ఉంది. దీంతో సంస్థలో అంతర్గత నియామకాలకు అర్హత పొందా. బీటెక్ మైనింగ్ అర్హత ఉండడంతో, సంస్థలో మైనింగ్ అధికారుల ఎంపిక పరీక్షలు రాసే అవకాశం వచ్చింది.

**-కన్నవేని సాగర్, శ్రీరాంపూర్**

### ఇక పర్మినెంట్ కార్మికుడిని..



సంస్థలో కారుణ్య ఉద్యోగం ద్వారా చేరా. నా తండ్రి రాజిరెడ్డి ఆర్కే 6గనిలో పని చేశారు. మాది హాజీపూర్ మండలం లోని రాపల్లి. ఐటీఐ ఫిట్టర్ చదివా. బదిలీ వర్కర్ నుంచి జనరల్ మజ్దూర్‌గా పదోన్నతి పొందడం సంతోషంగా ఉంది. ఇప్పుడు ట్రేడ్స్‌మెన్ కేటగిరీ పరీక్ష రాసే అవకాశం వచ్చింది. జనరల్ మజ్దూర్‌గా అవకాశం కల్పించిన యాజమాన్యానికి, సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

**-గడ్డం వెంకట్‌రెడ్డి, బదిలీ వర్కర్ ఎస్సార్పీ 3**

### ఐదు నుంచి ఏడేళ్లు పట్టేది..



గతంలో జనరల్ మజ్దూర్‌గా అవకాశం రావాలంటే 5 నుంచి 7 ఏళ్ల సమయం పట్టేది. ఇప్పుడు సీఎం కేసీఆర్ పుణ్యామని ఎప్పటికప్పుడు చేస్తున్నారు. 190 మస్టర్లు నిండితే, జనరల్ మజ్దూర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తున్నారు. నేను బీకాం చదివా. ఇప్పుడు అంతర్గత పరీక్షల్లో పాసైతే, నాకు కావాలనుకున్న జాబ్ కొట్టొచ్చు. చాలా సంతోషంగా ఉంది.

**-సందెవేని సతీశ్, జనరల్ మజ్దూర్ శ్రీరాంపూర్**

### అధికారి స్థాయికి వెళ్లొచ్చు..



నేను సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా 2021లో బదిలీ వర్కర్‌గా ఉద్యోగం పొందా. నా తండ్రి చిన్నయ్య ఆర్కే 5గనిలో ట్రామర్‌గా పనిచేసి అనారోగ్యంతో అన్‌ఫిట్ అయ్యారు. దాంతో నాకు ఈ ఉద్యోగం లభించింది. సంస్థలో బదిలీ వర్కర్‌గా పనిచేస్తూనే, సంస్థ నుంచి ఎన్‌వోసీ పొంది నేను ఎంఏ సోషయాలజీ చదువుతున్నాను. సంస్థలో జూనియర్ అసిస్టెంట్, ఓవర్‌మెన్, సర్ధార్ ఖాళీల ఎంపికకు పరీక్షలు రాసే అవకాశం లభిస్తుంది. దీంతో అధికారి స్థాయి వరకు వెళ్లే వీలుంటుంది.

**-మాటూరి వెంకస్వామి, శ్రీరాంపూర్**

### క్రమ శిక్షణతో చేసే వారికే మంచి గుర్తింపు



క్రమశిక్షణతో పనిచేసే వారిని సంస్థలో గుర్తింపు తప్పక వస్తుంది. సంస్థలో ఉద్యోగం రావడం ఒక వరంగా భావించాలి. క్రమశిక్షణతో విధులకు హాజరవుతూ కనీస మస్టర్లు సాధించాలి. అలాంటి వారినే ఇప్పుడు జనరల్ మజ్దూర్లుగా గుర్తించాం. జనరల్ మజ్దూర్లుగా ఎంపికైన వారందరికీ అభినందనలు. గతంలో జనరల్ మజ్దూర్లుగా ఎంపికైన చాలా మంది శ్రద్ధగా పనిచేస్తూ ఇంటర్నల్ పరీక్షల్లో పాల్గొని ఉద్యోగోన్నతులు పొందారు. ప్రతి ఒక్కరూ విధులపై అంకిత భావంతో పనిచేయాలి. సంస్థలో 2266 మంది జనరల్ మజ్దూర్లలో శ్రీరాంపూర్‌లో 677, ఆర్జీ-1లో 522, ఆర్జీ-3, ఆడ్రియాల ప్రాజెక్టులో 323, భూపాలపల్లి నుంచి 274, మందమర్రి నుంచి 261, మణుగూరులో 79, ఆర్జీ-2 నుంచి 51 మంది, బెల్లంపల్లి నుంచి 32 మంది, ఇల్లందు, కార్పొరేట్ నుంచి 19 మంది, కొత్తగూడెం నుంచి 9 మంది ఉద్యోగోన్నతులు పొందారు.

**-బలరామ్, డైరెక్టర్( ఫైనాన్స్)**

# యువ ఉద్యోగులను క్రీడల వైపు ప్రోత్సహించాలి

- మందమర్రి జీఎం మనోహర్



వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జీఎం మనోహర్

మందమర్రి, అక్టోబర్ 1: సంస్థలో యువ ఉద్యోగులను క్రీడల వైపు ప్రోత్సహించాలని సీనియర్ క్రీడాకారులకు మందమర్రి జీఎం ఏ.మనోహర్ సూచించారు. మందమర్రిలోని సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో ఏరియా స్థాయి 59వ వార్షిక క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏరియా స్థాయి బాడీబిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, కల్చరల్ ఈవెంట్లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారు రీజియన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. సింగరేణి క్రీడాకారులు కోలిండియా స్థాయిలో రాణించడం హర్షణీయమన్నారు. ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంస్థ అభివృద్ధికి దోహదం చేసిన వారవుతారని ఆయన పేర్కొన్నారు. ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, డీవైపీఎం మైత్రేయ బంధు, సంక్షేమాధికారి వంశీ, రీజియన్ స్పోర్ట్స్ సూపర్ వైజర్ సీహెచ్ అశోక్, కోఆర్డినేటర్ ఏ.రవికుమార్, బాడీ బిల్డింగ్ కెప్టెన్ ఎం వెంకటేశ్వర్లు, కల్చరల్ కెప్టెన్ సుదర్శన్, జనరల్ కెప్టెన్ చిన్నయ్య, గ్రౌండ్ ఇన్‌చార్జి నస్పూరి తిరుపతి తదితరుల పాల్గొన్నారు.

### గోలేటి సీఈఆర్ క్లబ్ లో డిపార్టుమెంటల్ క్రీడలు

రెబ్బెన, అక్టోబర్ 1: బెల్లంపల్లి ఏరియా లో కొనసాగుతున్న వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 90వ వార్షిక క్రీడలు ఆదివారం నిర్వహించినట్లు స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరిరావు తెలిపారు. ఇందులో బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు నియర్ బై ఏరియా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజు

## సమాజాన్ని చైతన్య పరిచేది కళాకారులే

కృష్ణకాలనీ, అక్టోబర్ 01: సమాజాన్ని చైతన్య పరిచే సత్తా కళాకారులకు మాత్రమే ఉంటుందని డిప్యూటీ పర్సనల్ మేనేజర్ గుండు రాజు అన్నారు. భూపాలపల్లి ఏరియాలోని కృష్ణకాలనీలో గల మినీ ఫంక్షన్ హలులో డబ్ల్యూపీఎస్అండ్ జీఎం ఆధ్వర్యంలో ఆదివారం కల్చరల్ పోటీలను నిర్వహించారు. ఈకార్యక్రమానికి డిప్యూటీ పర్సనల్ మేనేజర్ గుండు రాజు, ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం హాజరై నటరాజ చిత్ర పటానికి పూలమాల వేశారు. అనంతరం సీనియర్ కళాకారుడు, హెడ్ ఓవర్‌మెన్ జీవీటీసీ బందెల చంద్రరావు గీతంతో సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిభ చూపిన కళాకారులు రీజియన్ స్థాయికి ఎంపికవుతారని, ఆ తరువాత కంపెనీ స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం కోలిండియా స్థాయిలో సింగరేణి పతాకాన్ని ఎగురవేయాలన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కుటం రాజు, పర్శ శ్రీనివాస్, సుంకరి శ్రీనివాస రెడ్డి, ఉత్తమ్ కుమార్, కల్చరల్ కెప్టెన్‌గా సురేశ్ బాధ్యతలు నిర్వర్తించారు.